స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తాం

● ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

బేగంపేట్, జనవరి 12 : రాష్ట్ర వ్యాప్తంగా యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించాలనే సంకల్పంతో స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాలను సికింద్రాబాద్ బోట్స్ క్లబ్‌లోని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ కమిషనర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి సభ్యశాచి ఘోష్, సంచాలకుడు డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

జలమండలి శాఖ టీఎన్జీవో డైరీ ఆవిష్కరణ

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం జలమండలి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన నూతన సంవత్సర డైరీని టీజీవో హైదరాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. టీఎన్జీవో అధ్యక్షుడు మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో టీజీవో జలమండలి శాఖ జనరల్ సెక్రటరీ చంద్రజ్యోతి, జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, జనరల్ సెక్రటరీ హరిశంకర్, టీఎన్జీవో జనరల్ సెక్రటరీ అజయ్‌సింగ్, ట్రెజరర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లండన్ పర్యటనకు ఆమ్రపాలి

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, ఎంఆర్‌డీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి లండన్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలిసింది. శనివారం (13వ తేదీ) నుంచి 21వ తేదీ వరకు ఆమె లండన్‌లో పర్యటించనున్నట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలో మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టడానికి అధిక ప్రాధాన్యతనివ్వడంతో ఆమె ఇప్పటికే గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని సబర్మతీ నది తీర ప్రాంత అభివృద్ధిపై అధ్యయనం చేసి వచ్చారు. అదే విధంగా విదేశాల్లోని నగరాల్లో ఉన్న నదుల తీర ప్రాంత అభివృద్ధిపైనా అధ్యయనం చేసే క్రమంలోనే ఆమె లండన్ నగర పర్యటనకు వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. లండన్ నగరంలో ఉన్న థేమ్స్ నది తీర ప్రాంత అభివృద్ధిని అధ్యయనం చేయనున్నట్లు తెలిసింది.

విద్యుత్ అంతరాయాలు ఉండొద్దు

ఈ వేసవిలో వినియోగం రోజుకు 8.5 కోట్ల యూనిట్లు!

2 గంటల వ్యవధిలోపే మరమ్మతులు పూర్తి చేయండి.. టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : రానున్న వేసవి, రబీ పీక్ సీజన్లలో ఏర్పడే అధిక విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వినియోగదారుల శ్రేయస్సుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, వారు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. గతేడాది దక్షిణ డిస్కం పరిధిలో 9,860 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదు కాగా, రాష్ట్రంలో మొత్తం 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్ నమోదైందని, ఈసారి అదే స్థాయిలో డిమాండ్ నమోదయ్యే అవకాశం ఉందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గతేడాది మే నెలలో 3,756 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్‌తో 7933 కోట్ల యూనిట్ల వినియోగం జరిగిందన్నారు. ఈ ఏడాది సైతం మే నెలలో దాదాపు 4000 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఉండవచ్చని, 8.3-8.5 కోట్ల యూనిట్ల వినియోగం నమోదయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు.

సీఎండీ చేసిన సూచనలు

- అన్ షెడ్యూల్ విద్యుత్ అంతరాయాలు నివారించాలి. అంతరాయానికి గల కారణాలు విశ్లేషించి తగు చర్యలు తీసుకోవాలి.
- అన్ని 11 కేవీ ఫీడర్ల ఎనర్జీ ఆడిట్ చేయాలి. సప్లయి చేసిన విద్యుత్‌కు బిల్లింగ్‌కు వ్యత్యాసం ఉంటే ఆ పరిధిలోని సర్వీసులను తనిఖీ చేయాలి.
- ఖచ్చితమైన విద్యుత్ వాడకం బిల్లుల జారీ చేయాలి. ఏవైనా బిల్లింగ్ సంబంధిత ఫిర్యాదులు నమోదైతే వెంటనే పరిష్కరించాలి.
- విద్యుత్ నష్టాల తగ్గింపు కోసం అనధికార విద్యుత్ వాడకం నివారించాలి. దీని కోసం ప్రతి సర్వీసును పరిశీలించాలి.
- విద్యుత్ వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మునుపు మాదిరిగా అతి తక్కువ సమయంలో కేవలం 2 గంటల్లో మాత్రమే 11కేవీ, 33కేవీ ఫీడర్లు, సబ్‌స్టేషన్ల నిర్వహణ పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలి.
- సెక్షన్ స్థాయిలో చేపట్టే నిర్వహణ, మరమ్మతుల వివరాలను విద్యుత్ నిలిపివేసే సమయం వివరాలను మెసేజ్‌ల ద్వారా, ప్రాంతీయ వార్తా పత్రికల ద్వారా ఒక రోజు ముందుగానే వినియోగదారులకు తప్పనిసరిగా తెలియజేయాలి. ఫిబ్రవరి 20 నుంచి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశమున్నందున ఆలోగానే నిర్వహణ పనులు పూర్తి చేయాలి.

తాను మరణించి.. ఏడుగురికి జీవనదానం

శ్రీకాంతయ్యచారి (ఫైల్)

ఖైరతాబాద్, జనవరి 12 : తాను మరణిస్తూ.. ఏడుగురికి జీవనదానం చేశాడు ఆ యువకుడు. వరంగల్ తూర్పు జిల్లా గీసుగొండ మండల కేంద్రానికి చెందిన కర్నకంటి బ్రహ్మచారి, సరస్వతి దంపతుల కుమారుడు కర్నకంటి శ్రీకాంతయ్యచారి (28) ఓ ప్రైవేట్ దవాఖానలో పనిచేస్తున్నాడు. ఈ నెల 9న ఇంట్లో ఉండగా ఒక్కసారిగా తీవ్రమైన తలనొప్పి వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు నేరుగా బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ ఈ నెల 11న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవ దానం విశిష్టతను వివరించగా అందుకు అంగీకరించారు. శ్రీకాంతయ్యచారి శరీరం నుంచి గుండె, కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లు, ఒక ఊపిరితిత్తిని సేకరించారు. అవసరమైన రోగులకు వాటిని అందజేస్తామని వైద్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సృజనాత్మకత ఎక్కువ

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం

కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న బుర్ర వెంకటేశం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 12 : పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాలను మార్చేందుకు, వారి విద్యాభ్యాసానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిబద్ధతతో ఉన్నదని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అంతర్జాతీయ దృక్పథం, శాస్త్రీయ అధ్యయన పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించే ఉద్దేశంతో అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీతో కలిసి రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. 'ప్రోగ్రాం ఫర్ సైంటిఫికల్ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం ముగింపు సమావేశానికి బుర్ర వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో సృజనాత్మకత ఎక్కువగా ఉంటుందని అన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా కష్టపడాలని విద్యార్థులకు సూచించారు. హార్వర్డ్ వంటి అత్యున్నత విద్యాసంస్థల అధ్యాపకులు ఇక్కడికి వచ్చి బోధించడం ద్వారా విద్యార్థులకు విస్తృత అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన మాట్లాడుతూ విద్యార్థులు బలమైన విజ్ఞాన పునాధిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, కార్యక్రమ డైరెక్టర్ ప్రొఫెసర్ డొమినిక్ మావో, యూజీసీ డీన్ ప్రొఫెసర్ జి.మల్లేశం, ప్రొఫెసర్ మంగు, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సయీదా అజీముస్నీసా, డాక్టర్ కొండ నాగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వంటకాలతో పండుగ జరుపుకోండి

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ కొత్త ఏడాదిలో మార్పులను తీసుకువస్తుందని గోల్డ్ డ్రాప్ సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేశ్ లోహియా అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అనే నాలుగు రోజుల పండుగ తీపి రుచిని, భోజన ప్రియుల బొజ్జ నింపే పండుగని చెప్పారు. సంతోషంగా తెలుగు వంటకాలతో పండుగను జరుపుకోవాలన్నారు.

ఫైర్ సెఫ్టీపై అవగాహన

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలని జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి తెలిపారు. పాఠశాలలు, వాణిజ్య సముదాయాలలో మాక్ డ్రిల్ చేపట్టి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రమాదకరంగా భవన నిర్మాణ వ్యర్థాలను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 7444 బ్యానర్లు, పోస్టర్లను తొలగించినట్లు తెలిపారు.

గొర్రెల పంపిణీ ఎప్పుడు..?

మేడ్చల్, జనవరి12(నమస్తే తెలంగాణ) : కులవృత్తులను ప్రోత్సహించేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం కార్యక్రమంపై సందిగ్ధత నెలకొన్నది. ఒక్కో యూనిట్‌కు లక్షా75 వేలు కాగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 80శాతం సబ్సిడీని అందించి మిగతా 20శాతం రూ.43,750 లను లబ్ధిదారుల నుంచి డీడీల రూపంలో తీసుకుని పంపిణీ చేసింది. మూడవ విడతలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 900 యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉన్నందుగా.. కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో డీడీలు కట్టిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

18న జాబ్‌మేళా..

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : బోర్డు ఆఫ్ అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్, చెన్నై ఆధ్వర్యంలో ఈ నెల 18న న్యూ మల్లేపల్లిలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. వివరాల కోసం 8096436711 సంప్రదించాలన్నారు.

సీమాంధ్రలో సయ్యాటకు హైదరాబాద్ కోళ్లు

- శిక్షణ పొందిన పందెం కోళ్లను వెంట తీసుకుపోతున్న నగరవాసులు
- పోటీల్లో జోరుగా రాజకీయ, సినీ ప్రముఖులు

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : నువ్వా.. నేనా అన్నట్టుగా.. రణరంగంలో బలీయమైన కోళ్లు జూలు విదిల్చి కాళ్లకు కట్టిన కత్తులతో పోటీల్లో చెలరేగిపోతుంటే.. ఆ దృశ్యం చూడటానికి పందెంరాయుళ్ల ఆరాటం అంతా ఇంతా కాదు. ఆ కోళ్ల గెలుపోటములపై కోట్ల రూపాయల బెట్టింగ్ ఆధారపడి ఉంటుంది. కొందరు ఈ పోటీలను డబ్బులు రాబట్టుకోవడానికి చూస్తే.. మరికొందరు ప్రతిష్ట కోసం ఆసక్తి చూపిస్తుంటారు. అందుకే నిషేధం, కఠిన చర్యలు, జైలు శిక్షలు వంటి మాటలు ఎన్ని ఉన్నా.. ప్రజల్లో తరాలుగా నాటుకుపోయిన సంస్కృతి మాత్రం ఇంకా జోరందుకుంటుండటం విశేషం. అందులో భాగంగానే హైదరాబాద్ శివారులోని పలువురి వ్యవసాయ క్షేత్రాల్లో ఏడాది కాలంగా ప్రత్యేక శిక్షణ ఇచ్చి పెంచిన కోళ్లను పోటీల్లో దింపేందుకు సీమాంధ్రకు తీసుకువెళ్తున్నారు. మరికొందరు సొంతంగా పెంచుకున్న కోళ్లను, ఇంకొందరు కోళ్ల ఫామ్స్‌లో పెంచిన వాటిని వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసి తరలిస్తున్నారు. ముఖ్యంగా గౌడ నెమలి, తెల్ల నెమలి, కోడి నెమలి, కాకి డేగ, కక్కెర, రసంగి, గాజు కుక్కురాయి, అబ్రాస్, ఎర్ర డేగ వంటి జాతులను పందెంలో దింపేందుకు ఎంచుకుంటున్నారు. దీంతో ప్రజాప్రతినిధుల నుంచి సినీ తారల వరకు అందరూ సంక్రాంతి కోడి పందెంల పోరుబాట పట్టారు. ఇప్పటికే ఇక్కడి వారి ప్రయాణాలతో అక్కడి ప్రాంతాల్లోని లాడ్జీలు, హోటల్స్, రెస్టారెంట్స్‌లలో బుకింగ్స్ ఫుల్ అయ్యాయి.

దేవాదాయ శాఖ కార్యాలయం ముందు విలేకరులతో మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు తదితరులు

అర్చక జేఏసీపై బురద జల్లాలని చూస్తే ఊరుకోం

సుల్తాన్‌బజార్, జనవరి 12 : దేవాదాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న అర్చక, ఉద్యోగ సంఘాల జేఏసీపై బురద జల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు అన్నారు. శుక్రవారం బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి, అర్చక సంఘం అధ్యక్షుడు సీహెచ్ బద్రీనాథాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర శర్మలతో కలిసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అర్చక, ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా జీతాలు చెల్లించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. కొందరు అధికారులు, ఇతర అర్చక, ఉద్యోగ సంఘాల నాయకులు జీర్ణించుకోలేక అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, మతైక సంఘం అధ్యక్షుడు పి.శ్రీకాంత్, మతైక అర్చక సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

16న జైపాల్ రెడ్డి జయంతి

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 16న కేంద్ర మాజీ మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాట్లను చేయనున్నది. హుస్సేన్‌సాగర్ తీరంలో ఉన్న జైపాల్‌రెడ్డి సమాధి వద్ద పూల అలంకరణ చేయాలని ప్రభుత్వం శుక్రవారం ఆదేశించింది.

ఎలక్ట్రో హోమియోపతి వైద్యుల సంఘం అధ్యక్షుడిగా గంగాధర్

బన్సీలాల్‌పేట్, జనవరి 12 : తెలంగాణ ఎలక్ట్రో హోమియోపతి వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ జి.గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ వి.సుభాశ్, కోశాధికారిగా డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ సి.శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎన్.శంకర్ గౌడ్, సైంటిఫిక్ సలహాదారుడిగా డాక్టర్ ఎం.వేణుచారిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 12 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్), ఎంసీఏ, పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులతో పాటు సోషియాలజీ, సోషల్‌వర్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, మేనేజ్‌మెంట్, లా, ఎడ్యుకేషన్, ఎకానమిక్స్, కామర్స్, కెమిస్ట్రీ విభాగాల పీహెచ్‌డీ కోర్స్ వర్క్ (ప్రీ పీహెచ్‌డీ) పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ అధికారులు తెలిపారు.

పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 16, 17 తేదీలలో నిర్వహించనున్న వివిధ కోర్సుల పరీక్షలను వాయిదా వేశారు.

పరీక్షా తేదీలు ఖరారు

ఓయూ పరిధిలోని ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 17వ తేదీ నుంచి, మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 5వ తేదీ నుంచి నిర్వహించనున్నారు.

పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సు రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 22వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని, రూ.500 అపరాధ రుసుముతో 29వ తేదీ వరకు చెల్లించాలని ఓయూ అధికారులు తెలిపారు.

ఉచిత శిక్షణ జాబితా

ఉస్మానియా యూనివర్సిటీలోని సివిల్ సర్వీసెస్ అకాడమీలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ఉచిత శిక్షణకు ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేసినట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండ నాగేశ్వర్ తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా వంద మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు. జాబితాను ఓయూ వెబ్‌సైట్‌లో ఉంచామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 20న మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే ఓరియంటేషన్ కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం గాయత్రీ నృత్య కళాక్షేత్ర గురువులు వైష్ణవి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు.

- కొండాపూర్, జనవరి 12

ముగిసిన మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్

సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : ఏఐజీ హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన ఏషియన్ మెడ్‌టెక్ ఇన్నోవేషన్ సమ్మిట్-2024 శుక్రవారం ముగిసింది. పేషెంట్ కేంద్రంగా సొల్యూషన్స్ మార్గాలను గుర్తించడమే లక్ష్యంగా ఈ సమ్మిట్ జరిగిందని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 30 టెక్ కంపెనీలు పాల్గొనగా.. యూఎస్ఏ, టోక్యో, జపాన్‌కు చెందిన యూనివర్సిటీల నుంచి నిపుణులు ఈ సమ్మిట్‌లో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఏఐసీ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి, ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు డాక్టర్ రాకేశ్ కాలపల, పుర్ద్యు యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆండ్రూ, లైఫ్ సైన్సెస్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్(ఆర్ఐసీహెచ్) డాక్టర్ సుశ్మిత సుందర్, అజిత్ రగ్నేకర్, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో క్యాలెండర్ ఆవిష్కరణ

సుల్తాన్‌బజార్, జనవరి 12 : 72 ఏళ్ల చరిత్ర కలిగిన టీఎన్జీవో సంఘంపై ఎవరైనా బురద చల్లాలని చూస్తే ఉపేక్షించేది లేదని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో టీఎన్జీవో నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కట్కూరి శ్రీకాంత్, హరికృష్ణ ఆధ్వర్యంలో 2024 క్యాలెండ్ ఆవిష్కరణ సభకు కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాల్గవ తరగతి కేంద్ర సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, నగర అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.